క్లుప్తంగా

చిన్నారులకు వైద్యపరీక్షలు



ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి శివగాయత్రి

బలిజిపేట: మండలంలోని వెంగాపురం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలో 99మంది చిన్నారులకు అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివగాయత్రి సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు రక్తపరీక్షలు చేసి, బరువు తక్కువ ఉన్న వారిని గుర్తించి, పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించారు. ఎటువంటి ఆహారాన్ని తీసుకోవాలనే దానిపై సూచించారు. మంచి ఆహారాన్ని తీసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కె.లలిత, ఏఎన్‌ఎం రాజేశ్వరి, ఆరోగ్యకార్యకర్త సత్యనారాయణ, ఆశవర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

పార్వతీపురంటౌన్: రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తుందని ములగ సర్పంచ్ కృష్ణవేణి అన్నారు. ఈ మేరకు సోమవారం ములగ గ్రామంలో రైతులకు ఖరీఫ్ 2023 సంవత్సరానికి గాను విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులందరికీ విత్తనాల పంపిణీ చేపట్టామన్నారు. రైతుల సాగుకు అవసరమైన సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. కార్యక్రమంలో ములగ సచివాలయం పంచాయతీ కార్యదర్శి పకీరు, ఉద్యాన సహాయకురాలు రేణుక, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


పనులు వేగవంతం



పనులు పరిశీలిస్తున్న ఈఎన్‌సీ శ్రీనివాసరావు

సాలూరు: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ ఈఎన్‌సీ శ్రీనివాసరావు ఆదేశించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో మండలంలో ఎడ్యుకేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్రాంట్ ద్వారా జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. దాగరవలస నుంచి ఎగువదాగరవలసకు చేపడుతున్న 3.3 కిలోమీటర్ల బీటీ రోడ్డును, దుక్కడవలస నుంచి మర్తివలసకు చేపడుతున్న 2.52 కిలోమీటర్ల బీటీ రోడ్డు, పెద్దవలస నుంచి మూలవలసకు నిర్మిస్తున్న 900 మీటర్ల బీటీ రో డ్డును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట జేఈ బలివాడ సంతోష్, డీఈ మణిరాజ్, తదితరులు ఉన్నారు.

విత్తనాల సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు విత్తనాలు అందిస్తున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రంగునాయుడు

మక్కువ: ప్రభుత్వం అందిస్తున్న విత్తనాల సబ్సిడీని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు కోరారు. మండలంలోని కాశీపట్నం రైతుభరోసా కేంద్రంలో విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఏఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రంగునాయుడు మాట్లాడుతూ, గిరిజన రైతులకు విత్తనాలపై 90 శాతం సబ్సిడీ... మిగిలిన రైతులకు కేజీకి పది రూపాయలు చొప్పున సబ్సిడీ ఉంటుందన్నారు. ప్రస్తుతం 1600 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చెరువుల సందర్శన

పాలకొండ రూరల్: మండలంలో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న సాగు, తాగునీటి వనరుల అభివృద్ధి పనులను ఎంపీడీఓ డొంక త్రినాథులు సోమవారం పరిశీలించారు. తంపటాపల్లి, తుమరాడ, చింతాడ, అట్టలి తదితర గ్రామాల్లోని అమృత సరోవర్ పేరిట అభివృద్ధి చేసిన చెరువుల తాజా స్థితిగతులపై ఆరా తీశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధి, సచివాలయ సిబ్బందికి సూచించారు.

విద్యార్థులకు అండగా జగన్ మామ...



సాలూరు: బాగువలసలో జగనన్న విద్యాదీవెన కిట్లను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, తదితరులు

సాలూరు: విద్యార్థులకు ఓ మేనమామలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ అన్నారు. మండలంలోని బాగువలస జెడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని సంపదల కన్నా విద్యా సంపద గొప్పదని తెలిపారు. నాడు – నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

మున్సిపాలిటీలో..

మున్సిపాలిటీలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో స్థానిక ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా విద్యార్థులకు జగనన్న విద్యాకానక కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజశేఖర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం..



మక్కువ: విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

మక్కువ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు మామిడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంఈఓ వి. మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. నాడు – నేడు నిధులతో పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు. అలాగే ములక్కాయవలస మోడల్ స్కూల్ విద్యార్థులకు కూడా జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు.

మంచి విద్యను అభ్యసించండి



బలిజిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి, సర్పంచ్ రాఘులత

బలిజిపేట: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో విద్యార్థులు మంచి విద్యను అభ్యసించాలని ఎంపీపీ నాగమణి సూచించారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జేవీకే కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బ్యాగు, బూట్లు పంపిణీ చేస్తోందని తెలిపారు. చిన్నారులకు మంచి విద్యను అందించాలనే దృఢ సంకల్పంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులకు ఇవన్నీ ఉచితంగా ఇస్తున్నారన్నారు. గడిచిన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించారని సంతోషం వెలిబుచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘులత, జి.జగన్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతానగరంలో..



సీతానగరం: విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ కుసుమ, సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణ

సీతానగరం: పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేయడం అభినందనీయమని అప్పయ్యపేట ఎంపీటీసీ బి.కుసుమ, సచివాలయ కమిటీ కన్వీనరు బి.సూర్యనారాయణ అన్నారు. సోమవారం పాఠశాలల పునఃప్రారంభం రోజున ఉపాధ్యాయుడు ఆర్. శంకరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రభుత్వానికి అండగా ఉంటామని విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు అంటున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు గృహసారథులు, విద్యార్థుల పేరెంట్స్ పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

సీతానగరం: మండలంలో తాము ఎదుర్కొంటున్న ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలని పలు గ్రామాల సర్పంచ్‌లు సోమవారం ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్ ఎన్ సుశీల, జిలన్నంనాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయ తీల్లో నిరంతరం సేవలందిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు గ్రామ పంచాయతీ నిధుల నుంచి జీతాలు ఇవ్వాలని ఉన్నతాధికారులు చెప్పడంతో వారి మాట కాదనలేక బిల్లులు పెడుతున్నామన్నారు.

పంచాయతీలకు వచ్చిన 16వ ఆర్థిక సంఘం నిధులు వచ్చినవే తక్కువ వాటితో పారిశుధ్య పనులు విద్యుత్ బల్బులు, తాగునీటి పథకాల మరమ్మతులకే సరి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశార. ప్రభుత్వం నియమించిన గ్రీన్‌అంబాసిడర్లకు ప్రత్యామ్నాయంగా నిధులు సమకూర్చుకుని జీతాలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం నుంచి పంచాయతీలకు రావలసిన నిధులు సకాలంలో విడుదల చేసి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ప్రభుత్వానికి తెలియ జేయాలని కోరుతూ ఎంపీడీఓకు అందజేశారు.

మున్సిపాలిటీలో శరవేగంగా అభివృద్ధి



పట్టణంలో శివాజీ బొమ్మ జంక్షన్ వద్ద నిర్మిస్తున్న కాలువ

సాలూరు: మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత టీడీపీ హయాంలో ఎటువంటి అభివృద్ధి చేపట్టలేదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏజెన్సీతో పాటు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి జోరందుకుంది. ముఖ్యంగా మంత్రిగా పీడిక రాజన్నదొర బాధ్యలు చేపట్టాక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతుండడంపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో మున్సిపాలిటీలోని వార్డుల్లో ముమ్మరంగా పనులు చేపడుతున్నారు. శివాజి బొమ్మ జంక్షన్ నుంచి చినహరిజనపేట గోర్జి వరకు 600 మీటర్ల మేర కాలువను 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.19.5 లక్షలతో నిర్మిస్తున్నారు. 24వ వార్డులో జనరల్ ఫండ్ నిధులు సుమారు పది లక్షల రూపాయలతో పైలెట్ వాటర్ ట్యాంక్ నిర్మాణాలు, సామాజిక మరుగుదొడ్లకు మరమ్మతులు చేపడుతున్నారు. సాలూరు పరిసర మక్కువ బైపాస్ రోడ్డుకు సుమారు లక్షా 30 వేల రూపాయలతో మరమ్మతులు చేపట్టారు. షల్తిపేట వద్ద 15వ ఆర్థిక సంఘం నిధులతో కల్వర్టు పనులు జరుగుతున్నాయి. 3, 29 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మున్సిపాలిటీలో 85 లక్షల రూపాయల విలువ చేసే 84 పనులు వివిధ దశలలో ఉన్నాయి. పాఠశాలలు, ఆస్పత్రులను కోట్లాది రూపాయలతో ఆధునీకరించారు. పట్టణంలో వంద పడకల ఆస్పత్రి, కాకులతోట వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. మంత్రి రాజన్నదొర ప్రత్యేక చొరవతో వార్డుల్లో చురుగ్గా అభివృద్ధి పనులు జరుగుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



గంగాడలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించిన ఎమ్మెల్యే జోగారావు

● ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: పేదల అభ్యున్నతే ప్రభుత్వధ్యేయమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలం గంగాడలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందించడం, వారి అభ్యున్నతికి పాటుపడడం సీఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని అందుకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే పారదర్శకమైన పాలన అందించాలనే సంకల్పంతో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటుచేసి వారితో పథకానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తిస్తున్నామన్నారు. గ్రామస్థాయిలో నాయకుల ప్రమేయం, దళారుల జోక్యం లేకుండా, కార్యాలయాలచుట్టూ ప్రదక్షిణ చేయకుండా ఇల్లు కదలకుండా ఏప్రభుత్వంలో లబ్ధిదారులు సంక్షేమ పథకాలను పొందారో వారే గుర్తించాలని సూచించారు. ఇంతటి పారదర్శక పాలనతో పాటు కుటుంబంలో అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అనేది గుర్తించేందుకు, స్థానిక సమస్యలు తెలుసుకునేందుకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. గడిచిన కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు బుక్‌లెట్‌ద్వారా ఎమ్మెల్యే జోగారావు వివరించారు. గ్రామంలో మరికొంత మందికి గృహాలు మంజూరుచేయాలని ప్రజలు కోరగా తప్పకుండా మంజూరుచేస్తామని హామీ ఇచ్చారు. అర్హులై ఉండి పథకానికి దూరంగా ఉన్న వారు వెంటనే తెలియచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.నాగమణి, ఎంపీటీసీ శంకరరావు, సూర్యనారాయణ, బి.నారాయణరావు, ఎస్.జగన్, జి.వెంకటినాయుడు, అచ్యుతరావు, జి.జగన్, వి.గురురాజు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

36 మంది ఉపాధ్యాయులకు స్థానచలనం

సీతానగరం: మండలంలోని వివిధ పాఠశాలల్లో ఇంతవరకూ సేవలందించిన ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులు 36 మందికి, ముగ్గురు ఎస్‌జీటీలకు స్థానచలనం కలిగిందని ఎంఈఓ జి.సూరిదేముడు తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ లచ్చయ్యపేట, జగ్గునాయుడుపేట, చినభోగిలి పాఠశాలలకు కొత్త ఉపాధ్యాయులు వచ్చారన్నారు. ఎస్‌జీటీలు ఇద్దరు, పాపమ్మవలసకు ఒకరు, ఇప్పలవలస ఇద్దరు, నిడగల్లు దరి వెంకటాపురం ఇద్దరు, బూర్జకు ముగ్గురు, కృష్ణారాయపురం ఇద్దరు, పెదంకలాం, లక్ష్మీపురం, బుడ్డిపేట, సీతానగరం, అప్పయ్యపేట పాఠశాలలకు ఒక్కొక్కరు వంతున వచ్చారని తెలియజేశారు. జోగింపేట, బక్కుపేట, తామరఖండి, బళ్లకృష్ణాపురం, రామవరంలలో ఇద్దరు ఉపాధ్యాయులు వంతున బాధ్యతలు స్వీకరించారన్నారు. బగ్గందొరవలస, రెడ్డివానిలవలస, పణుకుపేట, వెన్నెలబుచ్చింపేట పాఠశాలలకు ఒక్కొక్కరు వంతున, కాశీపేటలో ముగ్గురు ఉపాధ్యాయులు వచ్చినట్లు తెలియజేశారు. ఇప్పటికే కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాలలకు వచ్చినట్లు చెప్పారు.

ఐసీడీఎస్ సిబ్బంది ర్యాలీ



గరుగుబిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆట పాటలతో విద్యా బోధన చేస్తున్నామని, తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని గరుగుబిల్లి, పెదగుడబ సెక్టార్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి కోరారు. జనభాగీదారి కార్యక్రమంలో భాగంగా పెదగుడబ, గరుగుబిల్లి, తదతర గ్రామాల్లో సోమవారం అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పూర్వ ప్రాథమిక విద్యా బోధనపై మరింత అవగాహన కల్పించేందుకు జనభాగీదారి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పల్ల కృష్ణవేణి, రౌతు పద్మ, మూడడ్ల స్వాతి, గర్బాపు గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో అత్యవసర వైద్య సేవలు

● డీఐఓ జగన్‌మోహనరావు



శిక్షణలో పాల్గొన్న డీఐఓ జగన్మోహన రావు

పార్వతీపురంటౌన్: సాధారణ వైద్యంతో పాటు అత్యవసర వైద్య సేవలు కూడా అందుబాటులో ఉండాలని డీఐఓ జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు జిల్లా ఆస్పత్రిలో కొద్ది రోజులుగా అత్యవసర వైద్య సేవలపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో సోమవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి. జగన్‌మోహనరావు పాల్గొని పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ వైద్యంతో పాటు అత్యవసర వైద్య సేవలు కూడా అందుబాటులో తెచ్చేందుకు వైద్య ఆరోగ్య శాఖ సూచనలు మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ బి. జగన్నాథరావు ఆధ్వర్యంలో ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం బ్యాచ్‌ల వారీగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా పాల్గొన్న డీఈఐ జగన్మోహన రావు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా ప్రథమ చికిత్స, పాము, కుక్క కాటులకు చికిత్స, ఐవి ఇన్ఫ్యూషన్,అన్ని పద్ధతుల ఇంజక్షన్లు వేయడం, గాయాలకు కుట్లు డ్రెస్సింగ్స్ చేయడం తద్వారా జీవన ప్రమాణాన్ని పెంచే నైపుణ్యం తదితర సేవలపై సీహెచ్‌ఓలు పొందిన పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రజలకు ఆయా సందర్భాల్లో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ నవీన్ కుమార్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్ కుమార్ పలు వైద్య సేవలపై శిక్షణ ఇచ్చారు. నోడల్ ఆఫీసర్స్ దుర్గా ప్రసాద్, తిరుపతి రావు, ట్రైనర్స్ నీలిమ, సంతోషి లక్ష్మిలు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా పనులు పూర్తి కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్

పార్వతీపురంటౌన్: ప్రాధాన్యతా పనులు పూర్తి కావాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జనరేట్ అయిన మెటీరియల్ కాంపొనెంట్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్ల పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీటీ రోడ్డు పనులు ఎంత వరకు పూర్తి చేశారో ఆరా తీశారు. ప్రస్తుతం పనుల సీజన్ అని, వర్షాలు ప్రారంభం కాకుండా ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా. ఎంవీఆర్ కృష్ణాజీ, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై మహిళలకు అవగాహన తప్పనిసరి



దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సంతోషిణి

పార్వతీపురం టౌన్: దిశ యాప్‌పై మహిళలకు అవగాహన తప్పనిసరి అని దిశ పీస్ ఎస్సై సంతోషిణి అన్నారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం చేపట్టిన దిశ యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా పార్వతీపురం పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ప్రజలతో ఆమె మమేకమై, దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణకు దిశ ఎస్ఓఎస్ యాప్ ఉపయోగపడే విధానాన్ని స్వయంగా వివరించి, వారి మొబైల్స్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ తమ రక్షణకు తప్పనిసరిగా స్మార్ట్ ఫోన్లలో దిశ ఎస్ఓఎస్ యాప్‌ను నిక్షిప్తం చేసుకోవాలని కోరారు. ఏ ఒక్క మహిళ అయినా ఆపద సమయాల్లో పోలీసుల సహాయాన్ని పొందేందుకు మొబైల్‌లో దిశ ఎస్ఓఎస్ యాప్ పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్, ప్లంబింగ్ ఉపాధి శిక్షణ పూర్తి



యువతకు ధ్రువీకరణ పత్రాలను అందజేసిన సంస్థ ప్రతి నిధులు

పార్వతీపురంటౌన్: యువత ఉపాధి, నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని లయ స్వచ్ఛంద సేవ సంస్థ కోఆర్డినేటర్ కాంతారావు సూచించారు. యువతకు ఉపాధి అవకాశం కోసం స్థానికంగా ఉండే ఎలక్ట్రికల్, ప్లంబింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యువతకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఈ శిక్షణ తీసుకున్న వారు స్థానికంగా వారి జీవనోపాధి పెంపొందించుకోవాలని చెప్పారు. నేటి యువత ఉపాధి అవకాశాల కోసం దూరప్రాంతాలకు వెళ్తున్న తరుణంలో ఈ విధమైన ఉపాధి శిక్షణ కార్యక్రమంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో లయ స్వచ్ఛంద సంస్థ పట్టణ కోఆర్డినేటర్ ఎస్.సత్యనారాయణ, జి.గౌరీ శంకర్ జి.కామేశ్వరరావు వెలుగు ఎఫ్‌పీఓ ఏపీఎం బి.మోహన్‌లు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



జేసీబీతో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. మండలంలోని లిడికివలస గిరిజన గ్రామానికి పక్కా రహదారి నిర్మించేందుకు రూ.1.23 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించడంతో ఎమ్మెల్యే జోగారావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా గ్రామానికి రోడ్డు కావాలని ఎదురు చూసిన గిరిజనుల నిరీక్షణకు మరి కొద్ది రోజుల్లో తెరపడుతుందని, నూతన రహదారి నిర్మాణం త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఏడాది క్రితమే అనుమతులు వచ్చాయని, కాంట్రాక్టర్లు రాకపోవడంతో ఆలస్యంగా ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.